

# ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి

## నేడు రక్షాబంధన్

బొంరాస్‌పేట/ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 18 : రక్షా బంధన్ అంటే సోదర సోదరీమణుల పండుగ. ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకొనే ఈ పండుగను రాఖీ పౌర్ణమి అని, జంధ్యాల పౌర్ణమి అనే పేర్లతో కూడా నిర్వహిస్తారు. ఏటా శ్రావణమాసంలో వచ్చే



ఆమనగల్లులో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కడ్తాల్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న ఆడపడుచులు

పౌర్ణమి రోజు సోదర సోదరీమణులు అత్యంత పవిత్రంగా వారి బాంధవ్యం కలకాలం నిలవాలని జరుపుకొనే పండుగ ఇది. జీవితాంతం తోడుంటానని భరోసా ఇచ్చేది రాఖీ పండుగ. పురాణాల్లో కూడా రాఖీ పండుగకు ఎంతో విశిష్టత ఉన్నది. సమాజంలో మానవతా విలువలు మంటగలుస్తున్న ఈ రోజుల్లో రాఖీ పౌర్ణమి వంటి పండుగలను జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మానవ సంబంధాలను మెరుగుపర్చడానికి ఈ పండుగ ఎంతో దోహదం చేస్తుంది. రక్తం పంచుకుని పుట్టిన సోదర సోదరీమణులే ఈ పండుగ జరుపుకోవాలని ఏమీలేదు. ఏ బంధుత్వమున్నా లేకపోయినా సోదరుడు, సోదరి అన్న భావన ఉన్న ప్రతిఒక్కరూ రక్షాబంధనాన్ని కట్టి వారి క్షేమాన్ని కోరుకోవచ్చు. ఆత్మీయుల మధ్య అనుబంధాలకు, ఐకమత్యానికి సరస్పర సహకారానికి చిహ్నంగా రక్షాబంధన్ పండుగ నిలుస్తుంది. సోదరులకు ఎప్పుడు రాఖీ కడుదామని సోదరీమణులు వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారు. రాఖీ పండుగ రోజు ఉదయాన్నే తలస్నానం చేసి



షాద్‌నగర్‌టౌన్ : రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు, యువతులు

కొత్త బట్టలు ధరించి రాఖీ కట్టడానికి సిద్ధమవుతారు. సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి అక్షతలు వేసి దీవిస్తారు. సోదరులు సంతోషపెట్టేలా వారికి కానుకలు ఇస్తుంటారు. అందుకే ఈ రాఖీ పండుగను ప్రియమైన వారితో ఘనంగా జరుపుకొందాం.

### రాఖీ కట్టేటప్పుడు చదవాల్సిన శ్లోకం

'యేన బద్ధో బలిరాజా దానవేంద్రో మహాబలః తేన త్వామభి బద్నామి రక్ష మా చల మా చల' అనే శ్లోకాన్ని చదివి రాఖీ కట్టాలి. ఆ తరువాత సోదరులకు హారతి ఇచ్చి స్వీట్లు తినిపించి నిండు నూరేళ్లూ సుఖంగా జీవించాలని దీవిస్తారు. నీకు నేను రక్ష, నాకు నీవు రక్ష అని చెప్తూనే.. నీవు రక్షణగా ఉండాలనే ధర్మాన్ని రక్షాబంధనంతో బోధిస్తారు. రాఖీ పౌర్ణమి రోజు సోదరులిచ్చే బహుమతులంటే సోదరీమణులకు ఎనలేని ప్రేమ. వారికిచ్చే బహుమతి ఏదైనా ఎంతో ప్రేమగా దాచుకుని తీపి



జ్ఞాపకంగా భావిస్తారు. ఆడపడుచుల రాకతో తెలుగు లోగిళ్లు సందడిగా మారుతాయి.

### కిటకిటలాడుతున్న దుకాణాలు

ఇప్పటికే రక్షాబంధన్ సందర్భంగా మార్కెట్లో బోలెడన్ని రాఖీలు దర్శనమిస్తున్నాయి. సరికొత్త డిజైన్లతో, రకరకాల రంగులతో, బంగారం, వెండి రాఖీలతో కళకళలాడుతున్నాయి. సోదరుల పేర్లతో కూడా రాఖీలు తయారు చేయించుకుంటున్నారు. రాఖీలు కొనడానికి మహిళలు పెద్దఎత్తున దుకాణాలకు తరలివస్తున్నారు. రోడ్లు, రాఖీలు అమ్మే దుకాణాలు, స్వీట్ హౌజ్‌లు కిటకిటలాడుతున్నాయి. పదిహేను రోజుల వరకు రాఖీలు కట్టే సందడి గ్రామాల్లో కొనసాగుతుంది.



సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

వికారాబాద్, ఆగస్టు 18 : బడుగు బలహీనవర్గాలు సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాపన్న గౌడ్ 374వ జయంతి ఉత్సవాలను వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు. పాపన్న సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీత కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సల్పిన మహాయోధుడని పేర్కొన్నారు. ఎటువంటి అండదండలు లేకుండా బడుగు కులాలను ఏకం చేసి భూస్వాములు, మొగల్‌లు శిస్తుల రూపంలో పన్నుల వసూళ్ల పేరుతో ప్రజలను పీడిస్తున్న క్రమంలో వారికి అండగా నిలిచి పోరాటం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల విద్యార్థులు దేశభక్తి పాటలను ఆలపించారు. కలెక్టర్ వారికి నోటు పుస్తకాలు, పెన్నులను బహూకరించారు.

కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఉపేందర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భీమరాజు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.



జాపాల నుంచి మంచాలకు వెళ్లే రోడ్డు వెంబడి చెట్లు


# ఆహ్లాదం.. ఆనందం

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దృఢ సంకల్పంతో నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. మంచాల మండలంలోని జాపాల నుంచి మంచాల, ఆరుట్ల నుంచి పీసీ తండా, లింగంపల్లి నుంచి లింగంపల్లి చౌరస్తా, చాంద్‌ఖాన్‌గూడ నుంచి ఆరుట్ల వరకు ఎటు చూసినా రోడ్ల వెంబడి చెట్లతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - మంచాల, ఆగస్టు 18

# విలసిల్లిన ఆధ్యాత్మిక శోభ

**ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

కొత్తూరు, ఆగస్టు 18 : కొత్తూరు మున్సిపాలిటీలో పునర్నిర్మించిన అష్ట గ్రామ దేవతల ఆలయాల్లో నూతనంగా అమ్మవార్ల ప్రతిష్ఠాపన ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో కొత్తూరులో పండుగ వాతావరణం నెలకొన్నది. ఉత్సవంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ విడివిడిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం వారు మట్లాడుతూ పురాతన ఆలయాల స్థానంలో కొత్తవాటిని నిర్మించి అమ్మవార్లను పునఃప్రతిష్ఠించడం గొప్ప విషయమన్నారు. ఈ ఆధ్యాత్మిక సంబురాన్ని మున్సిపాలిటీ ప్రజలంతా ఐకమత్యంతో నిర్వహించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఆలయాల పునర్నిర్మాణంతో గ్రామం సుఖశాంతులతో వర్ధిల్లుతుందని చెప్పారు. అష్ట అమ్మవార్ల దీవెనలు ప్రజలపై ఉండాలని ప్రార్థించామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, సోమ్లానాయక్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్, నాగరాజుచారి, గణేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిచారి పాల్గొన్నారు.



నందిగామ : అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కొత్తూరు : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

### ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**నందిగామ :** మండలపరిధి జంగోనిగూడ గ్రామం పృథ్వీ కాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామివాకి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సొంత ఖర్చులతో భక్తులకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ధ్వజస్తంభం ఏర్పాటు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు, మొగిలిగిద్ద శ్రీనివాస్ ఆలయ ముఖద్వారం, తుమ్మల జగన్ గర్భగుడి ముఖద్వారం, తుమ్మల నర్సింహులు పూజా గది నిర్మాణం చేశారు. వీరితో పాటు ఇతర దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, షాద్‌నగర్ మున్సిపాల్ చైర్మన్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీ చంద్రపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుమార్, రాజు, మాజీ ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, శంకరయ్య, జగన్, కుమార్, సుదర్శన్‌గౌడ్, కృష్ణగౌడ్, శ్రీశైలం, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు, బాలరాజు, సుధాకర్, వెంకట్‌రెడ్డి, యాదయ్య, నరేశ్ ఉన్నారు.



ఆస్పత్రి ఎదుట ముక్కు మూసుకొని మురుగునీటిని చూస్తున్న బీజేపీ నేతలు



ఆస్పత్రి ఆవరణలో నిలిచిన మురుగు నీరు

# కంపు.. కంపు

తాండూరు, ఆగస్టు 18 : తాండూరు పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణ కంపు మయంగా మారింది. ఆస్పత్రి ప్రధాన గేటుతోపాటు వెనుకవైపు మురుగునీరు నిలిచిపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారితో పాటు రోడ్డుపైన వాహనదారులకు కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే రోగాలు దరిచేరవని చెప్పే వైద్యుల ముందే ఇంత పెద్దఎత్తున అపరిశుభ్రత నెలకొంటే వాళ్లు చేసేదేమి లేక ముక్కుపై వేలేసుకొని కూర్చున్నారు. ఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉన్నది. దీంతో ఆదివారం బీజేపీ నేతలు డ్రైనేజీ నీళ్ల దగ్గరకెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని డిమాండ్ చేశారు.

## వేసవిని తలపించేలా ఎండలు

బొంరాస్‌పేట, ఆగస్టు 18 : వానకాలంలో ఎండలు మండుతున్నాయి. అప్పుడప్పుడు ఆకాశంలో మబ్బులు పట్టి వాతావరణం చల్లబడినా వేడి మాత్రం తగ్గడంలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా వేసవి తాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శ్రావణమాసంలో సమృద్ధిగా వర్షాలు కురిసే కాలం. కానీ వరుణుడు ముఖం చాటేశాడు. దాదాపు 20 రోజుల నుంచి మండలంలో వానల జాడ లేదు. జూన్, జూలై నెలల్లో వర్షాలు ఆశాజనకంగా కురిసినా పెద్దగా వానలు మాత్రం కురువలేదు. వర్షాధార పంటలకు మేలు చేసే విధంగా జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిశాయి. ఆగస్టు నెలలో మాత్రం తీవ్రమైన వర్షాభావం నెలకొన్నది. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురువకుంటే భవిష్యత్తులో సాగు ప్రశ్నార్థకమౌతుందని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే పెద్ద వర్షాలు లేక మండలంలోని చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. దీంతో వీటి కింద ఉన్న ఆయకట్టు వానకలం సాగుకు నోచుకోలేదు. యాసంగి సాగు కూడా అనుమానంగానే ఉన్నది. ముున్ముందు మంచి వర్షాలు కురువాలని రైతులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.



సంకేపల్లిగూడలో మల్లన్న బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

## ఘనంగా బోనాలు

షాబాద్, ఆగస్టు 18: షాబాద్ మండలంలోని సంకెపల్లిగూడ, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులంతా గ్రామ సమీపంలోని మల్లన్న ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలతో గ్రామాలు మార్మోగాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు మంచిగా పండాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## స్పా ముసుగులో వ్యభిచారం

కొండాపూర్/బాలానగర్, ఆగస్టు 18 : వేర్వేరు ప్రాంతాల్లో స్పా, మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న సెంటర్లపై పోలీసులు దాడిచేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఎస్‌వీఎల్ టవర్స్‌లో సాఫ్ట్ టచ్ వెల్ స్పా సెంటర్ కొనసాగుతున్నది. ఇందులో కొంతకాలంగా వ్యభిచారం కొనసాగుతున్నది. సమాచారం అందుకున్న హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులు ఆ సెంటర్‌పై దాడి చేసి.. వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళ, నలుగురు యువతులు, ముగ్గురు విటులు షేక్ ఇర్ఫాన్, ఎంఎన్ఎస్‌వీకే చైతన్య, నవీన్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు హనుమంతరావు పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్ 4లో ఎంఐజీ 286లో శ్రీలక్ష్మి నిలయం డాక్టర్ జీవీ కృష్ణారావు నివాసంలో స్పార్కిల్ పేరిట మసాజ్ ముసుగులో ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీకాలనీ పోలీసులు శనివారం రాత్రి కృష్ణారావు ఇంటిపై దాడిచేసి నలుగురు మహిళలు, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని మసాజ్ సెంటర్‌ను మూసివేశారు.

## ఆకట్టుకున్న భరతనాట్య నృత్య ప్రదర్శనలు



కొండాపూర్, ఆగస్టు 18 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో ఆర్‌కేవీఎస్ కళానిలయం నాట్య గురువు సుందరి రవిచంద్ర శిష్య బృందం ప్రదర్శించిన 'గురు వందన' భరతనాట్య నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కళాకారులు తన్వి, అధ్వైశ్రీ, సహస్ర, ప్రవళిక, వరుని, కావ్య, వైష్ణవి, హరిప్రియ, కీర్తి, అనామిక, నిత్య, ఆశ్రిత, కామాక్షి, రియా, క్యాథెరిన్, ఆరాధ్య తదితరులు పుష్పాంజలి, శ్లోకాలు, మల్లరి, నర్తన గణపతిమ్, నారాయణతే, గరుడ గమన, ఇదిగో భద్రాద్రి, ఒకపరి కొకపరి, ఆత్మ రామ, నగుమోము, మాధవ కేశవా, లక్ష్మీ అష్టకం, తక్కువేమి మనకు అంశాలను ప్రదర్శించి అలరించారు.

## బాలికతో అసభ్య ప్రవర్తన

**కేంద్రప్రభుత్వ ఉద్యోగిపై పోక్సో కేసు**

సైదాబాద్, ఆగస్టు 18 : ఓ ప్రభుత్వ ఉద్యోగి తన ఇంటి సమీపంలో నివసించే బాలికకు మాయ మాటలు ..అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఓ బస్తీలో నివాసముండే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి(55) తన ఇంటి పక్కనే నివసించే బాలిక(12)తో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించగా, వారు కేసు నమోదు చేసేందుకు నిరాకరించారు. బాలిక తండ్రి ఓ పోలీస్ అధికారి ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తుండటంతో ఆయనకు విన్నవించుకున్నాడు. దీంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

## వినాయక నవరాత్రులపై పోలీస్ ఫోకస్

సిటీబ్యూరో, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): వినాయక నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు నగర పోలీసులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే స్థానిక పోలీస్‌స్టేషన్లలో పీస్ కమిటీ, బస్తీ, కాలనీ సంఘాలతో సమావేశాలు ప్రారంభించారు. వినాయక మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నారు. ప్రశాంతమైన నగరంలో ఎలాంటి పుకార్లకు తావులేకుండా అందరూ కలిసిమెలిసి పండుగలు నిర్వహించుకోవాలనే సందేశాన్ని అందరికీ చేరవేస్తున్నారు. ఇప్పటికే అన్ని విభాగాలతో సమన్వయ సమావేశాన్ని పోలీసుశాఖ నిర్వహించింది.

## పబ్‌లో యువతికి వేధింపులు.. అడ్డుకున్న వ్యక్తిపై దాడి

శేరిలింగంపల్లి, ఆగస్టు 18 : పబ్‌లో యువతిని వేధించి అడ్డువచ్చిన ఆమె సంబంధీకుడిపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సన్‌సిటీలో నివాసయేండే ప్రశాంత్‌కుమార్ తివారీ శనివారం రాత్రి తన భార్య, మరో యువతితో కలిసి గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్ వాణిజ్య సముదాయంలోని క్రాస్ బ్లేడ్ పబ్‌కు వచ్చాడు. తిరిగి రాత్రి ఒంటి గంట సమయంలో పబ్ నుంచి బయటకు వస్తుండగా తన భార్యతోపాటు యువతిని మద్యం మత్తులో ఉన్న యువకులు వేధించారు. ప్రశాంత్‌కుమార్ వారిని నిలదీయగా.. వారు అతనిపై దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన యువతులపై సైతం దాడిచేశారు. దీంతో పబ్ నిర్వాహకులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను బయటకు పంపించారు. పబ్ బయట తిరిగి ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. వెంటనే ప్రశాంత్‌కుమార్ తివారీ గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.